క్లుప్తంగా

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి



గద్వాల వ్యవసాయం: జోగుళాంబ గద్వాల జిల్లాలో మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ గోపాల్ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంకను కోరారు. సంఘం సభ్యులతో కలిసి ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని మత్స్యభవన్‌లో మత్స్యశాఖ కమిషనర్‌ను కలిశారు. నడిగడ్డలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం పాలకమండలి సభ్యులు ఉన్నారు.

రాజోళికి ఆర్‌ఐ బదిలీ

మానవపాడు: మండలంలో విధులు నిర్వహిస్తున్న రజనీకాంత్‌రెడ్డి మంగళవారం రాజోళి మండలానికి బదిలీ అయ్యారు. గద్వాలలో విధులు నిర్వహిస్తున్న గురురాజ మానవపాడు ఆర్‌ఐగా బదిలీ అయ్యారు. మానవపాడులో మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వాహిద్ ఖాతున్ ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. బదిలీపై వెళ్లడం మండలంలో పలువురు ఆ విషయంపై చర్చించుకుంటున్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ



అశోక్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల ఇన్‌చార్జి విద్యాధికారిగా అశోక్‌కుమార్ మంగళవారం మండల వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న రాజు ఇటీవల పదవీ విరమణ పొందడంతో అలంపూర్ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధితో పాటు విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడం కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం రిటైర్డ్ ఎంఈఓ రాజుతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో సత్కరించి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీఓకు ఎంపీడీఓగా బాధ్యతలు



చంద్రకళ

అలంపూర్ రూరల్: అలంపూర్ మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎంపీఓ చంద్రకళ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చంద్రకళ మాట్లాడుతూ మండలంలో సమస్యలు లేకుండా చూస్తానని తెలిపారు. ప్రతి ఉద్యోగి బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. గ్రామాల్లో సమస్యలు రాకుండా చూసుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్‌తో యువకుడి మృతి

ధరూరు: యువకుడు బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందిన సంఘటన మండలంలోని మన్నాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ ఈదన్న, అంజనమ్మ దంపతులకు నలుగురు కుమారులున్నారు. వారిలో మూడో కుమారుడు తిరుమలేష్(19) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకున్నాడు. రెండేళ్లుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రెండు నెలలుగా హైదరాబాద్‌లో వైద్యం చేయించారు. రెండు రోజుల క్రితమే ఇంటి చేరుకోగా, మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు.

పులి సంచారంపై వదంతులు

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో పులి సంచరిస్తోందని, ఓ చెట్టుపై పులి ఉందని జల్లాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం వదంతులు సృష్టించి 100 డయల్ కాల్ చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామంలోని సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. స్పందించిన పోలీసులు గ్రామానికి వెళ్లి పంటపొలాల్లో పరిశీలించగా, పులి చారలతో ఉన్న జంతువు దర్శనమిచ్చింది. పోలీసులు చెట్టుపై ఉన్న జంతువును కదిలించగా, అది పులికాదని నిర్ధారణ అయింది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు, రైతులు, గ్రామస్తులు ఊపిరి పిల్చుకున్నారు.

పింఛన్ ఇవ్వాలని వికలాంగుడి ఆవేదన

మానవపాడు: మండలంలోని శ్రీనగర్ గ్రామానికి చెందిన బుచ్చన్నకు రెండేళ్ల క్రితం కాలు తీసేశారు. వికలాంగ సర్టిఫికెట్‌తో అధికారులకు ధరఖాస్తు చేసినా పింఛన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పూర్తిగా కాలు తీసేయడంతో ఏపని చేసుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరాడు.

ప్రైవేట్‌కు దీటుగా సర్కార్ బడి

- దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి
- విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి
- ఆధునిక పద్ధతుల్లో విద్యా బోధన
- పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు



అమరవాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మల్దకల్: ప్రభుత్వ బడులంటే ప్రతి ఒక్కరికి నిర్లక్ష్యమే.. కానీ జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చూస్తే ఆ అభిప్రాయం తప్పు అని ఒప్పుకోక తప్పదు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ధనం లేని వారు. కానీ విద్యలో మాత్రం సంపన్నులని ఈ పాఠశాల ఉపాధ్యాయులు నిరూపిస్తున్నారు. కార్పొరేటు పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దడంలో పదవీ విరమణ పొందిన జీహెచ్‌ఎం బీఎస్ రవి కృషి మరువలేనిది. చదువులను కొనక్కర్లేదు, చదువుకుంటే చాలు అని విద్యార్థులు విద్యవైపు మళ్లించిన రవిని జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గతంలో ఎంపిక చేసి ప్రశంసలు అందుకున్నాడు.

పాఠశాలలో మౌలిక వసతులు

ప్రైవేటు విద్యా సంస్థల తరహాలో ప్రొజెక్టర్, కంప్యూటర్లతో విద్యాబోధన సాగిస్తున్నారు. గదుల్లో విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, కుర్చీలు, శుద్ధ జలం, గ్రంథాలయం, తరగతి గోడలపై దేశ నాయకుల చిత్రపటాలు, పాఠశాలల గోడలపై రంగురంగుల చిత్రాలతో ప్రభుత్వ పథకాలను వివరిస్తూ హరితహారం ప్రాముఖ్యత, బాలకార్మికుల నిర్మూలన, బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలంటూ గోడలపై రాయించారు. మధ్యాహ్న భోజనం తయారుచేసే వంట గదికి సైతం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా ముందుండి నడిపిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడంలో పాఠశాల ఉపాధ్యాయులు ముందు నిలుస్తున్నారు. ఆయన పదవీ విరమణ అనంతరం ప్రస్తుత హెచ్‌ఎం నరేష్‌తో పాటు ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి



ప్రొజెక్టర్‌తో విద్యాబోధన



జెడ్పీహెచ్‌ఎస్ సైన్స్‌ల్యాబ్‌లో విద్యార్థులు

పాటుపడుతున్నారు. ఈ పాఠశాలకు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు లభించే విధంగా ప్రస్తుతం ఉపాధ్యాయ బృందం పాఠశాలను అదే తరహాలో అభివృద్ధి పరుస్తూ తీర్చిదిద్దుతున్నారు.



ఆకట్టుకునేలా గోడలపై రాతలు

పాఠశాలను ఉత్తమంగా తీర్చిదిద్దుతా



పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి పరిచి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే మా ప్రధాన లక్ష్యం. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా ట్రస్టు నిర్వాహకులు, గ్రామస్తులు, పూర్వపు విద్యార్థుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి పరుస్తున్నాం.

– నరేష్, జీహెచ్‌ఎం, అమరవాయి

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవిబాబు

అలంపూర్: దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలపై వాహనదారులు అవగాహన పెంచుకోవాలని అలంపూర్ సీఐ రవిబాబు అన్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద కమ్యూనిటీ పోలింగ్‌లో భాగంగా మంగళవారం వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ రవిబాబు, ఉండవెల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు హాజరయ్యారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులతో సమావేశం నిర్వహించారు. దేశంలోకి ఈ నెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రవాణా చట్టాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. బైక్ నడిపే వారు తప్పక హెల్మెంట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్ వాహనదారులు సీటుబెల్టు ధరించాలన్నారు. వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలను తప్పక ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వారితో పాటు ఉండవెల్లి పోలీసులు తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీలకు ఘనంగా సన్మానం



కేటిదొడ్డి: ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీల పదవీ కాలం ముగియడంతో వారిని మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, ఎంపీడీఓ రాములు నాయక్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, ప్రజలు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధన దీక్ష విజయవంతం చేద్దాం



అలంపూర్‌లో దీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

అలంపూర్: ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం టీఎస్ ఎమ్మార్పీస్ చేపడుతున్న దీక్షను విజయవంతం చేద్దామని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్ కోరారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రాజ్యాంగ నిర్మాత బాబసాహెబ్ విగ్రహం వద్ద టీఎస్ ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణ దీక్ష కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిన 30 వార్షిక దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాసులు మాదిగ జూలై 7న దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. ఏబీసీడీ వర్గీరణతోనే మాదిగలకు వాటి 59 ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. మాదిగల స్థితిగతులపై జస్టీస్ రామచంద్రరాజు కమిషన్ వర్గీకరణకు అనుకూలంగా నివేదిక ఇవ్వడంతో 2000 నుంచి 2004 వరకు వర్గీకరణ అమలు కావడం జరిగిందన్నారు. నాలుగు సంవత్సరాల వర్గీకరణతో ఉమ్మడి రాష్ట్రంలో 22 వేల మందికి ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. ఇప్పటి వరకు వేసిన కమిషన్లలో ఎస్టీలలోని 59 ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని స్పష్టంగా నివేదికలు ఇచ్చినప్పటికి రాజకీయ పార్టీలు వర్గీకరణకు మద్దతిచ్చి ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రేమదాసు, ఎల్లన్న మాదిగ, జయ్యన్న మాదిగ, కిరణ్ మాదిగ, లాజర్ మాదిగ, సీరాజ్ , వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఎల్కూరులో తప్పిన ప్రమాదం



మల్దకల్: సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు ఒక పెద్ద వేప చెట్టు కూలి రేకుల గుడిసెపై పడింది. ఆ సమయంలో ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో బయటికి రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎల్కూరు గ్రామానికి చెందిన ఏసన్నకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రోజులాగే వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్నాడు. రాత్రి ఏసన్న కుటుంబ సభ్యులతో కలిసి రేకుల గుడిసెలో నిద్రించాడు. రాత్రి పెద్ద ఎత్తున ఈదురుగాలులు రావడంతో రేకుల గుడిసెలో నుంచి బయటికి వచ్చాడు. వెంటనే గుడిసె ముందు ఉన్న వేప చెట్టు కూలి గుడిసెపై పడింది. ఆ సమయంలో లోపల ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

కంకరతోనే కాలం వెళ్లదీస్తారా?



కంకర వేసిన తుమ్మిళ్ల-రాజోళి రోడ్డు

రాజోళి: గ్రామాలకు బీటీ రోడ్లు వేయకుండా కంకర వేసి, దాంతోనే అధికారులు కాలం వెళ్లదీస్తారా? అని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రోడ్లు వేసేందుకు గత ప్రభుత్వం మొదలుపెట్టిన పనులు ఇప్పటివరకు పూర్తి కాలేదు. రాజోళి నుంచి పడమటి గార్లపాడు మీదుగా తుమ్మిళ్లకు వెళ్లేందుకు రోడ్డు వేయాలని మూడేళ్లకు పైగా పనులు చేపట్టినా అవి పూర్తి కావడం లేదని పేర్కొంటున్నారు. గతంలో మట్టి రోడ్డు అలాగే ఉంటడంతో కొంత కాలం తర్వాత కంకర వేసి వదిలేశారు. ఈ వర్షాకాలం ఇబ్బందులు పడకుండా పనులు పూర్తి అవుతాయనుకుంటే, మళ్లీ కంకరతోనే సరిపెట్టారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం గుండా రాజోళికే కాకుండా అత్యవసర సమయంలో కర్నూల్‌కు వెళ్లేందుకు చాలా దూరం తగ్గుతుంది. ఈ రోడ్డు వేసేందుకు ఇంత ఆలస్యం చేయడం తగదని తుమ్మిళ్ల, మాన్‌దొడ్డి, ననసూర్, పెద్ద ధన్వాడ, చిన్నధన్వాడ గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి యువకుడికి గాయాలు



అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడు సమీపంలో మంగళవారం ఆటో బోల్తాపడింది. ఆటోలో చిన్న తాండ్రపాడుకు చెందిన బోయ సతీష్‌తో పాటు మరో ముగ్గురు యువకులున్నారు. అయిజ నుంచి చిన్న తాండ్రపాడుకు ఆటోలో వెళ్తున్న క్రమంలో ప్రమాద వశాత్తు ఆటో రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడిపోయింది. ఆటో డ్రైవర్ సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో గోతిలో పడికముందే ముగ్గురు యువకులు ఆటోలో నుంచి కిందికి దూకడంతో వారికి ప్రమాదం జరగలేదు. గాయపడిన సతీష్‌ను కుటుంబ సభ్యులు కర్నూలులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఉండవెల్లి: మండలంలోని మారమునగాల గ్రామానికి చెందిన సంజన్న మృతి చెందడంతో బాధిత కుటుంబానికి 10వ తరగతి పూర్వ స్నేహితులు రూ.61,500 నగదును అందజేశారు. మారమునగాల గ్రామానికి చెందిన సంజన్న అనారోగ్య కారణాలతో గత నెల 23న మృతి చెందాడు. మానవపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 ఏడాదికి చెందిన పదో తరగతి స్నేహితులు కలిసి రూ.61500 నగదును స్నేహితుని భార్య గీతకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మారమునగాల–1 గ్రామానికి చెందిన కురుమూర్తి, శివ నారాయణ, రవి, బీచుపల్లి, శంకర్, నాసిర్, యూసఫ్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



గోన్‌పాడులోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మొక్క నాటుతున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గద్వాల అర్బన్: కేజీబీవీ విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. గద్వాల మండలం గోన్‌పాడులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఓ శ్రీదేవి, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ బాబు, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి, బంగి నవీన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి



మానవపాడు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రిజ్వానా తాన్వీర్

రాజోళి: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆయన మంగళవారం ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వాతావరణం మార్పులు జరిగినప్పుడు ఆరోగ్యంలో మార్పులు వస్తుంటాయని, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు మలేరియా, డయేరియా లాంటి వ్యాధులపై కూడా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. దాని కోసం వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా ప్రజలను చైతన్యపరచాలని, చెట్ల పెంపకం వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలను తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, రంజిత్ కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మానవపాడు: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని డాక్టర్ రిజ్వానా తాన్వీర్ సూచించారు. మంగళవారం ఏఎన్ఎమ్‌లు, ఆశలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో గర్భిణులకు సాధారణ కాన్పులపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో డ్రై డే నిర్వహించాలన్నారు.



రాజోళిలో మొక్కలు నాటుతున్న వైద్య సిబ్బంది

ఏఎన్ఎమ్‌లకు, ఆశలకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ సత్యానారాయణ, సూపర్‌వైజర్ చంద్రన్న, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, ఏఎన్ఎమ్‌లు, ఆశలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలన



పల్లెపాడులో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మానవపాడు: మండల కేంద్రంలోని పల్లెపాడు, చందూరు, బోరవెల్లి, జల్లాపురం గ్రామాలలో మంగళవారం రికార్డులను ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాలలో గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు అభివృద్ధి పనులకు వినియోగించిన బిల్లులను పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి కోసం పంచాయతీ కార్యదర్శి అంకితాభావంతో పని చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో నిధులను విడుదల చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సమస్యలు పట్టడం లేదు



లింగన్‌వాయిలో మాట్లాడుతున్న జీకే ఈదన్న

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి గ్రామంలో శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం దగ్గర ఉన్న విద్యుత్ స్తంభం ఎన్నో ఏళ్లక్రితం ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ స్తంభం విరిగేందుకు సిద్ధంగా ఉందని ఎన్నోసార్లు అధికారులు చెప్పిన పట్టించుకోవడం లేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగేందుకు సిద్ధంగా ఉందని, వేసవిలో పశువుల మేతతో వచ్చిన ట్రాక్టర్ కాలిపోయి ప్రాణాలతో బయటపడినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. రైతులు పండించిన పంటలు మార్కెట్ తరలించాలంటే ఆ దారి నుంచే పెద్ద వాహనాలు వస్తుంటాయన్నారు. విద్యుత్ అధికారులు తీగలు సరిచేస్తామని కాలయాపన చేస్తున్నారన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి త్వరిత గతిన నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన తో పాటు రైతులు బీచుపల్లి, రెహమాన్. వెంకటేష్, శ్రీనివాసులు, రంగముని, నాగరాజు, మల్లికార్జున్ కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బల్గెరలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

గట్టు: మండలంలోని బల్గెరలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ, మరో పాఠశాలకు బదిలీపై వెళ్తున్న రంగన్న, శేఖర్‌తో పాటుగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ంఎగా బల్గెరకు వచ్చిన దీనావతిని గ్రామస్తులు ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణయ్యగౌడు, అంగన్‌వాడీ టీచర్లు అలివేలు, లక్ష్మి, కవిత, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ బాసు బొజ్జయ్య నాయుడు, బాసు గోపా ల్, వీరేష్, బాసు సాయి, ఇసాక్, నర్సింహులు, తి మ్మప్ప, ఎంపీఎఫ్ వలంటీర్లు బాసు నర్సన్న, చిరంజీవి, వీరేష్, గంగన్న పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం



రెవెన్యూ సిబ్బంది సమీక్షలో మాట్లాడుతున్న తహశీల్దార్ రాజు

ఆత్మకూర్: ధరణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, దరకాస్తులను వేగంగా పరిశీలిస్తున్నామని తహసీల్దార్ రాజు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించిన అనంతరం దరకాస్తుల పరిశీలనను పర్యవేక్షించారు. భూ సమస్యలు, తప్పొప్పులు, ఇతరాత్ర దరకాస్తులన్నింటినీ పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. మొత్తం 225 దరకాస్తులు రాగా ఇప్పటి వరకు 143 దరకాస్తును పరిశీలించి కలెక్టర్ కార్యాలయానికి పంపించామన్నారు. మిగిలిన 82 దరకాస్తుల పరిశీలన మూడు రోజుల్లోగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జయమ్మ, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది నయ్యూం, చందు, రఘు, హరీష్, రాము, పరశురాము, సంపత్, నారాయణ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: తహసీల్దార్ కార్యాలయం అధికారులు ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 226 దరఖాస్తులు రాగా.. మూడు రోజుల నుంచి 45 దరఖాస్తుల సమస్యలను పరిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు.